ప్రజాశక్తి

శుక్రవారం 4 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నేడు 'బూచేపల్లి'కి పార్టీ పగ్గాలు

కార్యాలయాలను ముట్టడిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు దాచుకున్న పొదుపు డబ్బులను వెంటనే గ్రూపులకు ఇప్పించాలని కోరారు. విపత్తుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మండలంలో ఎప్పుడూ రాని విధంగా వరదలు రావడంతో రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నీటమునిగిన ప్రతి ఇంటికీ హౌస్‌బోల్డ్ మ్యాపింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం వచ్చే విధంగా ప్రభుత్వం కషి చేయాలని కోరారు. వరదల కారణంగా ప్రజలకు పనులు లేనందున ఉపాధి హామీ పనులను వెంటనే కల్పించాలన్నారు. నీటమునిగిన రైతుల మోటార్లకు ఎన్యుమరేషన్ చేసి డబ్బులు ఇవ్వాలన్నారు. రైతులకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. రాయబార కార్యక్రమం వద్దకు మండల తహశీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం వచ్చి వరదల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం వచ్చే విధంగా కషి చేస్తామని, రాని వారి పేర్లు నమోదు చేసి వచ్చే విధంగా చూస్తామని చెప్పారు. డ్వాక్రా రుణమాఫీపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వ బ్యాంకుల అధికారుల నుండి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.గంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కష్ణమోహన్, కౌలు రైతుసంఘం నాయకులు టి.సురేష్, నాయకులు బి.సుబ్బారావు, పి.నాగమల్లేశ్వంరావు, అగ్గి రామయ్య, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా భక్తులకు దర్శనం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయములో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులందరికీ ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

(మొదటిపేజీ తరువాయి)

బూచేపల్లిపై విశ్వాసంతో ఉన్నారు. అన్ని రకాలుగా ఇప్పుడున్న పరిస్థితుల్లో బూచేపల్లి సరైన నేతగా భావించారు. ఏకాభిప్రాయంతోనే ఆయనకు పార్టీపగ్గాలు అప్పగిస్తున్నారు. రెండు దశాబ్దాలకుపైగా బూచేపల్లికుటుంబం జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. వ్యాపారాల్లో ఆర్థిక పరిపుష్టిని సాధించారు. వివాదాలకు దూరంగా ఉండే బూచేపల్లి కుటుంబీకులు సేవా కార్యక్రమాల్లోనూ ముందే ఉంటారు. అదే వారిని ఇప్పటి వరకూ రాజకీయంగా నీడలా కాపాడింది. గ్రానైట్ వ్యాపారంలో కీలకంగా ఉన్న బూచేపల్లి సుబ్బారెడ్డి 2004 ముందు నుంచే కాంగ్రెస్ పార్టీతో రాజకీయాన్ని ప్రారంభించారు. అప్పటి ఎన్నికల్లో దర్శి టిక్కెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అధిష్టానం ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగారు. కమ్యూనిస్టుల మద్దతుతో అప్పట్లో ఎమ్మెల్యేగా గెలిచారు. సుబ్బారెడ్డి పోటీ చేసే సమయంలో ఆయన సతీమణి బూచేపల్లి వెంకాయమ్మ అన్నీ తానై నిలిచారు. అందరి మన్ననలు పొందారు. అంతటి కాంగ్రెసు గాలిలోనూ దర్శిలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి రికార్డు సృష్టించారు. కొద్దికాలంలోనే అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానాన్ని పొందారు. పార్టీలో చేరారు. తర్వాత వైఎస్ బాగా అభిమానించే కుటుంబంగా గుర్తింపు పొందారు. తర్వాత 2009 ఎన్నికల్లో ఆయన కుమారుడు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. నామినేషన్ వేసిన మొదటిసారే ఎమ్మెల్యేగా గెలిచారు. దర్శి నియోజకవర్గంలో ప్రత్యేక స్థానం అన్నిరకాలుగా ఏర్పాటు చేసుకున్నారు. వైఎస్ మరణం తర్వాత కష్టకాలంలోనూ జగన్ వెంట నడిచారు. తర్వాత బూచేపల్లి సుబ్బారెడ్డి అనారోగ్యంతో మరణించారు. దీంతో 2019 ఎన్నిలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అయినా నియోజకవర్గంలో పట్టుకోల్పోకుండా తనను అభిమానించే వారికి అన్నిరకాలుగా అండదండలు అందించారు. అప్పట్లో పార్టీ అభ్యర్థి గెలుపునకూ కృషి చేశారు. మొన్న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతటా కూటమి గాలివీచినా దర్శిలో మాత్రం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విజయం సాధించారు. ఇక్కడ కేవలం బూచేపల్లి కుటుంబంపై ఉన్న ఆదరణే కారణంగా గెలుపు సాధ్యమైంది. ఈ ఎన్నికల్లోనూ బూచేపల్లి సర్వశక్తులూ ఒడ్డారు. అన్ని రకాలుగా పోరాడారు. ప్రత్యర్థి పార్టీలోనూ కొందరిని తనకు అనుకూలంగా మార్చుకున్నారనే చర్చ లేకపోలేదు. రాజకీయవ్యూహం అలా నడిచింది. దర్శి నియోజకవర్గంలో ఈ కుటుంబం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దర్శి జడ్పీటీసీగా బూచేపల్లి వెంకాయమ్మ గెలిచి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఇలా ఈ కుటుంబం దర్శి నియోజకవర్గంలో అన్ని విధాలా చారిత్రకంగా నిలిచింది. ఇప్పుడు పార్టీ జిల్లా పగ్గాలు చేపడుతున్నారు. ఇదొక కీలక బాధ్యతగానే భావించాలి. అధికారం లేనప్పుడు, కష్టాల్లో పార్టీ ఉన్నప్పుడు అన్నీ తానై నడిపేందుకు ముందుకు రావడం గమనార్హం. ఇక బూచేపల్లి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లూ చేశారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-మార్కాపురం

మాట్లాడుతున్న ఎస్ఐ అంకమ్మరావు

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దని మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమరావు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కన్వెన్షన్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటే ప్రతి ఒక్కరూ ఉన్నతంగా రాణిస్తారన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘీక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.మస్తానయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరదలో నష్టపోయిన వారందరికీ పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోవడంపై ఆరా తీశారు. తక్షణమే వారి ఇళ్లకు వెళ్లి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. సచివాలయాల వారీగా పర్యవేక్షణ జరగాలన్నారు. పరిశీలన, పర్యవేక్షణ బాధ్యత ఇన్చార్జి ఆర్డీవోదేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరిశీలన, విచారణ తదుపరి సేకరించిన వివరాల నివేదికను రాజధానికి పంపాలని జేసీకి సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆయా శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకు తగినంత అందకుండా ప్రభుత్వాలు ఉక్కు ఫ్యాక్టరీని నీరుగార్చేందుకు కుట్రలు పన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి మాట్లాడుతూ రూ.3.50 లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేవలం 1300 కోట్లకు తన అనుకూల కార్పోరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించటం దేశద్రోహ చర్యని ధ్వజమెత్తారు. అత్యంత నాణ్యమైన ఉక్కు ఉత్పత్తితో నవరత్నాలలో ఖ్యాతికెక్కిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతి సంపదగా గుర్తించాలన్నారు. అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముందు తరం త్యాగధనులైన ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రజలు, విద్యావంతులైన యువజనుల శ్రేయస్సు కోరి చేసిన త్యాగఫలమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలుపుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం నుండి తొలగించిన 4 వేల మంది ఉద్యోగులను తిరిగి ఉద్యోగాలలో తీసుకునేలా జరిగిన పోరాటం ప్రజా ఉద్యమ విజయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రకాశం జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు మాట్లాడుతూ జాతి సంపదను ఇప్పటికైనా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టే విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మానుకోవాలని, లేకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, పూర్వవైభవాన్ని రాబట్టాలని, అందుకు రాష్ట్ర ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా పోరాడి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకోవాలని కోరారు. విప్లవ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.కె మాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె మౌలాలి, హేతువాద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెవి కష్ణయ్య, ఐపిఎల్ అధ్యక్షులు దాసరి సుందరం, బిఎస్‌పి నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ప్రముఖ రచయిత పిన్నిక శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె సైదా, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కోడూరి నాంచార్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జిపి.రామారావు ప్రసంగించారు. నిరసన దీక్షలో జిల్లాలోని శింగరాయకొండ, మద్దిపాడు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, చీమకుర్తి, కొండపి, కనిగిరి మండలాల నుండి అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, మహిళలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జివారి కోర్టులో.

O.S.No. 239 / 2019.

బిట్వీన్:
గోలి గంగాధరరావు ...వాది.

వర్సెస్

కాశి శంకర సీతారామ ప్రసాద్ మరియు ఇతరులు ... ప్రతివాదులు.

To:
(3వ ప్రతివాది) కాశి సాయి ఈశ్వర్ తేజ,
S/o. కాశి శంకర సీతారామ ప్రసాద్, హిందూ,
వయస్సు 24 సంవత్సరాలు, ప్లాట్ నెం.204,
మదాలసా గురుచరణ్ అపార్ట్మెంట్,
నియర్ వాసవి కాన్వెంట్, స్వర్ణ రోడ్, చీరాల,
చీరాల మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబర్ దావాలో వాది మీ మీద పెర్మనెంట్ ఇంజక్షన్ కోసం దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు ఎన్ని మార్లు సమన్లు పంపిన సదరు సమన్లు ముట్టక కాలయాపన చేయుచున్నారు అని శ్రీ కోర్టు వారు భావించి సదరు సమనులు ఈ ప్రకటన ద్వార జారి అగుటకు ఉత్తర్వులు జారీచేసి యున్నారు. కావున మీకు పై నెంబర్ గల దావాలో ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల ది. 14-10-2024 ఉదయం 10.30 నిమిషాలకు పై కోర్ట్ వారి ఎదుట మీరు గాని మీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలసినది. లేని యేడల మీ పరోక్షమున దావా విచారించి తీర్మానింపబడునని తెలియపరచడం అయినది.

// కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు //

హియరింగ్ తేది : 14-10-2024.

ఇట్లు
శ్రీకాంత్ ఠాకూర్,
రామకృష్ణ ఠాకూర్,
యం.అశోక్ కుమార్,
ఆర్.మోహనరాణి,
యం. రామకృష్ణ,
న్యాయవాదులు,
c/o. THAKUR'S OFFICE,
చీరాల.

మహారాజశ్రీ గౌరవనీయులైన ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో

IA NO 1868 / 2022
IANO.113 / 2022
OS NO 158 / 2020

అన్నెం మహాలక్ష్మీ .....పిటిషనరు / వాది

వర్సెస్

పల్లెల్ల వీరారెడ్డి మరియు వగైరాలు ....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

నోటీసు

టూ:
మాదాల నాగేశ్వరరావు, తండ్రి శ్రీ రాములు,
హిందువు, వయస్సు 50 సం.లు, నాగులుప్పలపాడు
గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై తెలిపిన కోర్టువారి యెదుట పై తెలిపిన పిటిషనరు / వాది పై తెలిపిన నెంబరు పిటిషను తేది 30-09-2022న 1,2, 5 నుండి 8 రెస్పాండెంట్లపై కోర్టువారు పాస్ చేసిన డిస్ మిస్ ఫర్ డీఫాల్ట్ ఆర్డర్‌ను రద్దుపరచమని అండర్ ఆర్డర్ 9 రూల్ 4 మరియు సెక్షన్ 151 సిపిసి ప్రకారం పిటిషను దాఖలు చేసుకొనియుండగా సదరు పిటిషనులో మీ నోటీసు నిమిత్తం తేది:18-10-2024కి వాయిదవేసి యున్నారు. ఇందు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్ననూ పై తెలిపిన కోర్టువారియెదుట పై తెలిపిన తేదిన ఉదయం 10-30 గంటలకు హాజరు పడి మనవి చేసుకొనవలసినదిగా తెలియజేయడమైనది లేనియెడల మీ పరోక్షమందు పైపిటిషన్‌ను తీర్మానించదరని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

ఇట్లు
గొట్టిపాటి శ్రీనివాసరావు,
పిటిషనరు తరపున న్యాయవాది,
ఒంగోలు/అద్దంకి,
ప్రకాశం జిల్లా

ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 491/2022

మీసాల వెంకటేశ్వరరావు ... వాది

వర్సెస్

మీసాల హనుమంతరావు మరియు వగైరా ..... ప్రతివాదులు

To
D3) ఎండేటి విజయలక్ష్మి
D/o వెంకటస్వామి, R/o ఫస్ట్ లైన్ ,గోపాల్ నగర్,
ఒంగోలు టౌన్ ప్రకాశం జిల్లా.
D14) షేక్ గఫార్,
S/o మహమ్మద్ షరీఫ్,
Rep by its G.P.A.Holdar name,
షేక్ మల్లికా బేగం W/o అహ్మద్ షరీఫ్
డోర్ నెంబర్3-63, గంగవరం, సంతనూతలపాడు
మండలం మరియు గ్రామం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావా అయిన OS No 491/2022లో 3,14, ప్రతివాదులైన మీకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావా OS No 491/2023 లో మీ హాజరు నిమిత్తము తేది : 14-10-2024 న వాయిదా కలదు కనుక ఆరోజు అనగా తేది: 14-10-2024న ఉదయం 10.30 గంటల నిమిషాలకు పై కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై పై నెంబరు దావాలో మీ ఆక్షేపణలు తెలియజేసుకోనవలెను లేనియెడల పై నెంబర్ దావా మీ పరోక్షమున తీర్మానించెదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పెండ్యాల శివహరి
షేక్ హిదాయతుల్లా
అడ్వకేట్స్, ఒంగోలు

లీగల్ ప్రకటన

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో

IA.NO.2121/2022
OS NO.481/2022

కంభంపాటి మార్తమ్మ మరియు వగైరాలు .....పిటిషనర్లు / వాదులు

వర్సెస్

ముట్లూరి అంజయ్య మరియు 45 మంది వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
9వ రెస్పాడెంట్/ప్రతివాది:
కొత్తపల్లి శిలువరాణి, తండ్రి బుజ్జి, పావులూరు
గ్రామం, ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.
19వ రెస్పాడెంట్/ప్రతివాది:
పరిమి పీరమ్మ, భర్త లేటు నాగేశ్వరరావు,
చిన్న జమ్మలమడక గ్రామం, బల్లికురవ మండలం,
బాపట్ల జిల్లా.
23వ రెస్పాడెంట్/ప్రతివాది:
పరిమి ఏసుకుమారి, మైనర్ తరపున తల్లి గార్డియన్
పరిమి పీరమ్మ, తండ్రి లేటు నాగేశ్వరావు, చిన్న
జమ్మలమడక గ్రామం, బల్లికురవ మండలం,
బాపట్ల జిల్లా.

పై నెంబరు పిటిషినర్లు/వాదులు, రెస్పాండెంట్స్/ప్రతివాదులపై భాగపంపిణి కొరకు మరియు దావా షెడ్యూలు ఆస్థిని ఇతరులకు అమ్మవద్దని దావా దాఖలు చేయగా అనేకసార్లు నోటీసులు పంపిననూ పైన తెలిపిన 9,19,23వ ప్రతివారులు తీసుకొనక పోవుట వలన శ్రీ కోర్టువారు పేపరు ప్రకటన కొరకు ఆర్డరు వేసి ఉన్నారు. పైన తెలిపిన ప్రతివాదులు తేది 28-10-2024 ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనిచో పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేది : 28-10-2024

(కోర్టువారి ఆర్డర్ ప్రకారం)

ఇట్లు
గొట్టిపాటి శ్రీనివాసరావు
పిటిషనర్లు/వాదులు తరపున అడ్వకేట్
ఒంగోలు/అద్దంకి

ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అధికారులతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

లోన్లు కట్టాలని ఒత్తిడి చేస్తే..

కార్యాలయాలను ముట్టడిస్తాం..

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-కొల్లూరు

వరదల కారణంగా రాబోయే మూడు నెలల పాటు పనులు ఉండవని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆదుకోవడం కోసం రుణమాఫీ చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాంక్ అధికారులు గానీ, డ్వాక్రా అధికారులు గానీ లోన్లు కట్టాలని మహిళలపై ఒత్తిడి తెస్తే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. వరదల కారణంగా నష్టపోయిన కొల్లూరు మండలం లోని లంక గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని, రైతులు, వ్యవసాయ కూలీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఐద్వా కొల్లూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సామూహిక రాయబార కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కష్ణా నది వరదల వల్ల డ్వాక్రా మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు బాగా ▶ 2లో

నేడు బూచేపల్లికి పార్టీ పగ్గాలు

- వైసిపి కష్టకాలంలో జిల్లాలో కీలక బాధ్యతలు
- జిల్లా రాజకీయచరిత్రలో బూచేపల్లి కుటుంబానికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నాడు కాంగ్రెసు పార్టీ.. ఇప్పుడు వైసిపి.. తాము నమ్ముకున్న పార్టీకి విధేయులుగా ఉండటం.. తమకు అవకాశం ఉన్న మేరకు ప్రజాసేవ చేయడం అటు పార్టీకీ.. ఇటు తమకు అండగా ఉన్న కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులోనూ, అండగానూ నిలబడటం బూచేపల్లి కుటుంబం ప్రత్యేకత. జిల్లా రాజకీయ చిత్రపటంలో ఓ ప్రత్యేక స్థానం ఆ కుటుంబానికి ఉంది. రెండు దశాబ్దాలకు పైగా జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు వైసిపి అధికారం కోల్పోయి కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీపగ్గాలు చేపట్టబోతున్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కూడా పార్టీకి విధేయులుగా ముద్ర వేసుకున్నారు. వైసిపి అధినేత జగన్ దృష్టిలో తమ బంధువర్గం కన్నా బూచేపల్లిపైనే ప్రత్యేక శ్రద్ధ ఉంది. అందుకే ఇప్పుడు ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పెట్టారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించనున్నారు. నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్ష పీఠంపై కూర్చోనున్నారు. జిల్లాలో వైసిపికి మళ్లీ పూర్వవైభవం తెచ్చే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవలే పార్టీని వీడారు. జనసేనలో చేరారు. ఆయన పార్టీని వీడిపోవడం పెద్ద నష్టంగా భావించారు. అయితే వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన జగన్ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. అప్పటి కప్పుడు బూచేపల్లిని పార్టీ అధ్యక్షుడిగా ఖరారు చేసి ప్రకటించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బూచేపల్లి తప్ప మరొకరు పార్టీని నడపలేరనే అభిప్రాయంలో వైఎస్.జగన్ గట్టిగా ఉన్నారు. అందుకు తగ్గట్లుగానే నిర్ణయం తీసుకున్నారు. అటు ఎమ్మెల్యేగానూ, ఇటు పార్టీ అధ్యక్షుడిగా రెండు కీలక బాధ్యతల్లో ఇప్పుడు బూచేపల్లి కొనసాగాలి. అధికారం ఉంటే ఏదైనా సులువుగానే ఉంటుంది. అధికారంలో లేనప్పుడే పరీక్ష. అందుకు బూచేపల్లి సిద్ధమయ్యారు. అన్ని సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. రానున్న కాలం ఎంతో కీలకం. అనేక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వంపై పోరాటం చేసే బాధ్యత. మరోవైపు తన తల్లి బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ ఛైర్‌పర్సన్‌గానూ ఉన్నారు. ఇద్దరూ పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారు. అన్ని నియోజకవర్గాల్లోనూ నాయకులు కూడా ▶ 2లో

వరదలో నష్టపోయిన వారందరికీ పరిహారం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వరద విపత్తులో నష్టపోయిన వారందరికీ పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిహారం పంపిణీపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సాంకేతిక కారణాల ద్వారా పరిహారం అందలేక పోయినా అర్హులైన వారందరి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. గృహాలు దెబ్బతిన్న వారికి పరిహారం

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

రావాలన్నారు. దెబ్బతిన్న వాహనాలకు బీమా వచ్చేలా చూడాలన్నారు. అలాగే నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటలకు బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణాల షెడ్యూల్ చేయడానికి బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎంకు సూచించారు. 815 వాహనాలు దెబ్బతినగా బీమా కంపెనీలతో మాట్లాడి అవసరమైతే సదరు కంపెనీలతో సమావేశమై పరిహారం వచ్చేలా చూడాలన్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డులు అనుసంధానం గాకపోవడంతో రూ.18 లక్షల పరిహారం అర్హులైన వారికి చేరలేదన్నారు. దెబ్బతిన్న 13 వాహనాలకు, గేదెల షెడ్లలకు నగదు రాలేదన్నారు. వివిధ కారణాలతో 203 మందికి పరిహారం ▶ 2లో

పిడుగుపాటుకు

బిటెక్ విద్యార్థిని మృతి ▶ 7లో

దీక్షలలో పాల్గొన్న సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే ప్రైవేటీకరణ
- త్యాగధనుల త్యాగాలను విస్మరించవద్దు
- నిరసన దీక్షలలో కేంద్రాన్ని హెచ్చరించిన వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రాణాలైనా అర్పించి.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని పలువురు వక్తలు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన దీక్ష గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఒంగోలు కలెక్టరేట్ వద్ద మూడో రోజు కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కౌలు రైతుల సంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్ష వర్గంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించిన సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ అనుకూల కార్పోరేట్ శక్తులకు విశాఖ ఉక్కును దోచి పెట్టేందుకే కేంద్రంలోని బిజెపి ఉవ్విళ్ళూరుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తన ఆలోచనలను విరమించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ▶ 2లో



ఒంగోలులో కీర్తిసురేష్ సందడి

ఒంగోలులో ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తిసురేష్ సందడి చేశారు. నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన చెన్నై షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తూ.. వారిలో ఉత్సాహం నింపారు.

- ప్రజాశక్తి, ఒంగోలు



చెక్కు అందజేస్తున్న దాతలు దేవినేని హర్షవర్ధన్

అన్నా క్యాంటీన్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రేపల్లె

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో దివంగత మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి కృష్ణ కుమారి జ్ఞాపకర్థం ఆమె మనవరాలు దేవినేని గీతా స్వర్ణ, మనవడు దేవినేని హర్షవర్ధన్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు ప్రభుత్వంతోపాటు దాతలు స్పందించి విరాళాలు ఇవ్వటం వలన మరింత మంది పేదల ఆకలి తీర్చేందుకు సాయపడుతుందని చెప్పారు. విరాళాలు అందజేస్తున్న దాతలను స్ఫూర్తిగా తీసుకొని మరి కొంతమంది ముందుకు రావాలని కోరారు.

బ్యాంకర్ల సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతనిస్తూ రుణాలు మంజూరు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. బ్యాంకర్ల త్రైమాసిక సమావేశం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని పిజిఆర్ఎస్ మందిరంలో గురువారం నిర్వహించారు. స్వయం ఉపాధి కోసం అధిక రుణాలను మంజూరు చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావిత మండలాల్లో రుణాల రీ షెడ్యూల్ చేయాలని అన్నారు. ఆర్ఎస్ఈటిఐ సంస్థల్లో నైపుణ్య శిక్షణ నిర్వహించేలా లబ్ధిదారులను సమీకరించాలని అన్నారు. బ్యాంకులు, అనుబంధ శాఖల పరస్పర అవగాహనతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అన్నారు. ప్రజలకు, రైతులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎల్‌డిఎం శివకృష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు వైద్య ఉపసంచాలకులు

90శాతం రాయితీపై గోకులాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

పశుపోషకుల సౌకర్యార్థం గోకులాల షెడ్డుల నిర్మాణానికి 90శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తున్నట్లు పశు వైద్య ఉపసంచాలకులు ఎన్ భార్గవ్ కుమార్ తెలిపారు. సబ్సిడీపై సమీకృత పశు దాణా అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకొల్లు గంగవరం రోడ్డులోని సచివాలయంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ఎఓ వేణుగోపాల్ మాట్లాడుతూ పత్తి సాగు చేసిన రైతులు లింగాకర్షణ బుట్టలు ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ సహాయకురాలు

మగ్గం గుంటల్లో నీళ్లు చేరిన

చేనేతలకూ పరిహారం ఇవ్వాలి

చేనేత కార్మిక మహాసభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గద్దె హేమ సుందరరావు

సత్యనారా యణ

చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చేనేత శాశ్వత రక్షణ సదస్సుకు మురుగుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడారు. చేనేతను ఒక పథకం ప్రకారం నాశనం చేయడానికి ప్రభుత్వాలు పూనుకున్నాయని ఆరోపించారు. చేనేతకు నిధులు కేటాయించకుండా, సహకార రంగానికి బాకీలు ఇవ్వకుండా, 11 రకాల చేనేత రిజర్వేషన్లు అమలు చేయకుండా, వస్త్ర నిలవలు కొనుగోలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత గురించి మొసలి కన్నీరు కారుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2లక్షల కోట్లలో రూ.2వేల కోట్లు కేటాయిస్తే బకాయిలన్నీ తీర్చవచ్చని అన్నారు. చేనేత ఉత్పత్తుల నిల్వలను కొనుగోలు చేయవచ్చన్నారు. చేనేత పథకాలన్నీ అమలు చేయవచ్చని చెప్పారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ మానవుడికి నాగరికత నేర్పి నాగరిక మానవుడిని తయారు చేసిన చేనేత పరిస్థితి దారుణంగా తయారయ్యిందని అన్నారు. జాతీయ జెండాలో చేనేత రాట్నం పెట్టుకొని విదేశీయులను తరిమికొట్టిన పాలకులు చేనేతకు మరణ శాసనం రాస్తున్నారని ఆరోపించారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. భోగస్ సహకార సంఘాలను రద్దు చేయాలని అన్నారు. చేనేతపై జిఎస్టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె శివ దుర్గారావు, చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి కొండయ్య, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా సమితి నాయకులు జి బాలాజీ, జడ్పిటిసి ఉదయభాస్కరి బాలాజీ, దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, రాధా, గద్దె బాబు మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డును పునర్ధించాలని కోరారు. నేతన్న నేస్తం చేనేత కార్మికులందరికీ వర్తింపజేయాలని కోరారు. చేనేత వృత్తులకు కూడా అమలు చేయాలని అన్నారు. చేనేత సహకార సంఘాలకు రావాల్సిన ఆప్కో బకాయిలు, యారన్ సబ్సిడీలు, పావలా వడ్డీ, త్రిఫ్ట్ ఫండ్ అన్నిటిని వెంటనే చెల్లించాలని కోరారు. మూడు సెంట్ల స్థలం కేటాయించి హౌస్ కం వర్క్ షెడ్డు నిర్మించి ఇవ్వాలి అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని తీర్మానించారు. చేనేతకు బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, ఏడాదికి రూ.50వేలు కేటాయించాలని, చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. అనంతరం చేనేత కార్మిక సంఘం నూతన జిల్లా కమిటీ అధ్యక్షులుగా గద్దె హేమ సుందరరావు, జిల్లా కార్యదర్శిగా మురుగుడు సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు

తలపనేని రామారావు

జిల్లాలో ఖరీఫ్ పూర్తయి రబి సీజన్ ప్రారంభమైందని, రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేసుకుంటున్న సమయంలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. ఇటీవల కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కోరారని, వారి ఆదేశాల మేరకు అధికారులు ఎక్కడ ఎరువుల కొరత రాకుండా చూడాలని కోరారు. ఎరువుల కొరత ఏర్పడినా, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మిన వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. అద్దంకి, పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు, కోరిసపాడు మండలాల్లో రబి సీజన్లో మిర్చి, పొగాకు, వరి, పత్తి, శనగ పంటలను సాగు చేస్తారని చెప్పారు. వీటన్నిటికీ ఎరువులు అవసరం ఉందని అన్నారు. నాగార్జున సాగర్ కాలువ పరిధిలో 71వేల ఎకరాల్లో మాగాణి, లక్షా రెండు వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతాయని తెలిపారు. సాగర్ చివరి భూముల వరకు సాగునీటిని ఇవ్వాలని కోరారు. జిల్లాలో సాగర్ కాలువలపై 128మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 25 మంది మాత్రమే ఉన్నారని, అందువలన జిల్లాకు రావలసిన నీటి వాటా రావటం లేదని, వచ్చిన కొద్దిపాటి నీరు కూడా సక్రమంగా పంపిణీ కావటం లేదని ఆరోపించారు. అధికారులు తక్షణమే కనీసం 50మందినైనా కాంట్రాక్ట్ పద్ధతిలో లస్కర్లుగా తీసుకోవాలని కోరారు. సాగునీటి పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. గత నాలుగేళ్ల నుండి ఎబిసి హెడ్ (18వ మైలు) దగ్గర జిల్లాకు రావలసిన నీరు రావడంలేదని అన్నారు. సాగర్ కాలువల్లో విపరీతంగా చెట్లు పెరిగి నీటిపారుదలకు ఆటంకంగా ఉన్నాయని అన్నారు. దీనివల్ల కాలువ గట్లు బలహీన పడుతున్నాయని అన్నారు. అధికారులు తక్షణమే కాలువలోని చెట్లు తొలగించాలని, కాలువ కట్టలు బలహీనంగా ఉన్నచోట మరమ్మతులు చేయాలని కోరారు.

రోడ్డు వెంబడి చెట్ల తొలగింపు

ప్రవేటు పాఠశాల యాజమాన్యం కృషికి అభినందనలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సుమేధ స్కూల్ డైరెక్టర్

నిత్యం ప్రజలు ప్రయాణించే రహదారి వెంబడి తుమ్మ చెట్లను తొలగించాలని అధికారులు, రాజకీయ నాయకులకు ఎన్ని సార్లు మొరపెట్టిన పట్టించుకోలేదు. దీంతో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. రోడ్డు వెంబడి ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లను తమ సొంత నిధులతో జెసిబి ఏర్పాటు చేసి చెట్లను తొలగించారు. రోడ్డు విశాలంగా మారడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వలపర్ల నుండి రామకూరు మీదుగా గుర్రంవారిపాలెం వెళ్లే రహదారిలో నిత్యం వాహనదారులు అద్దంకి నుండి ప్రయాణం చేస్తుంటారు. ఈ రహదారి వెంబడి గత కొన్నేళ్లుగా తుమ్మ చెట్లు దట్టంగా పెరిగాయి. ఆ రోడ్డులో బైకులు అదుపు తప్పి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహన దారుడు అద్దంకి నుండి వలపర్ల గ్రామానికి వెళుతూ బైక్ అదుపు తప్పి మృతి చెందిన ఘటన ఆ గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. జె పంగులూరు, అద్దంకి మండలాల పరిధిలోని ఈ సమస్యను గత ప్రభుత్వ హయం నుండి స్థానిక అధికారులు, రాజకీయ ప్రతినిధులకు తెలిపినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చేసేది లేక గ్రామస్తులు మిన్నకుండి పోయారు. ఈ క్రమంలో వలపర్ల గ్రామంలో సుమేధ హై స్కూల్ డైరెక్టర్ కెల్లంపల్లి ప్రమీలాదేవి దృష్టికి రోడ్డు వెంబడి పెరిగిన తుమ్మ చెట్ల వల్ల జరుగుతున్న ప్రమాదాలను స్థానికులు తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారం కోసం సుమేధ పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. తమ సొంత నిధులతో జేసీబీని ఏర్పాటు చేసి గుర్రంవారిపాలెం నుండి రాంకూరు గ్రామాల మధ్య ఉన్న షుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో రహదారి వెంబడి తుమ్మ చెట్లను తొలగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చేయలేని పనిని ఓ పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చి పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు తొలగించక ముందు, తర్వాత రోడ్డు

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపీపీ, సిబ్బంది

ఎంపిడిఒ చంద్రశేఖర్ బదిలీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎంపిడిఒ గుమ్మా చంద్రశేఖర్ పొన్నూరు బదిలీ అయ్యారు. ఆయనను ఎంపిపి డివి లలిత కుమారి, కార్యాలయం సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. అటెండరుగా పనిచేస్తున్న కట్టా భార్గవ్ కొల్లూరు ఎంపిడిఒ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీరు ఇరువురిని షాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కృష్ణా జిల్లా విస్సన్నపేటలో ఎంపిడిఒగా పనిచేసిన ఎస్‌వి రమణ భట్టిప్రోలు ఎంపిడిఒగా శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి జలజ, పిఆర్ ఎఈ చంద్రశేఖర్, గృహ నిర్మాణ శాఖ ఎఈ సౌమ్య రేవతి, ఉపాధి హామీ పథకం టిఎ సుధీర్, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖో ఖో జట్టుకు ఎంపికైన తమ్మా ఉమా హర్షిత

రాష్ట్ర ఖోఖో బాలికల జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రాష్ట్రస్థాయి బాలికల ఖో ఖో జట్టుకు స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని తమ్మా ఉమా హర్షిత ఎంపికైంది. కారంపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన అండర్ 14 అంతర్ జిల్లాల పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 5న ఉమ్మడి ప్రకాశం జిల్లా జె పంగులూరులో నిర్వహించే ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తమ విద్యార్థిని ఎంపికైందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఎస్ఎంసి చైర్మన్ తలాడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

జల 'కళే'

- పడకేసిన పథకం
- నిరుపయోగంగా బోర్లు
- మోటార్లు ఇవ్వని వైనం
- ఎండుతున్న పంటలు
- లబోదిబో మంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి ప్రభుత్వం జలకళ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. రైతుల పొలాల్లో బోర్లు తవ్వి మోటార్లు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2001 సెప్టెంబరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జలకళ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత అర్హులైన రైతుల పొలాల్లో బోర్లు తవ్వి వ్యవసాయ సర్వీసులిస్తామని జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. తర్వాత మాట తప్పారు. విద్యుత్తు సర్వీసులు రైతులే తీసుకోవాలని, ఇందుకు నగదు సైతం వారే చెల్లించాలని ప్రభుత్వం కొర్రీలు పెట్టింది. తొలుత విద్యుత్తు సర్వీసులు పొందిన వారికి మాత్రమే మోటార్లు ఇస్తామని స్పష్టం చేసింది. ఏడాదికి ఒక్కో నియోజకవర్గానికి 500 బోర్లు తవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో రైతులు ఎంతో ఆశతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు.

యర్రగొండపాలెం క్లస్టర్ పరిధిలో..

యర్రగొండపాలెం క్లస్టర్ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, మార్కాపురం, దొనకొండ మండలాలు ఉన్నాయి. మొదటగా దొనకొండ, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలను జలకళలో ఎంపిక చేశారు. దొనకొండ మండలంలో 896 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 74 మంది రైతులకు వ్యవసాయ బోర్లు మంజూరయ్యాయి. 61 మంది రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లు వేశారు. అందుకోసం రూ. 28, 45, 580 ప్రభుత్వం ఖర్చు చేసింది. ఒక్క మోటారు మాత్రమే బిగించారు. అందుకోసం రూ. 1,03,782 వెచ్చించారు. పుల్లలచెరువు మండలంలో 1976 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 70 మందికి వ్యవసాయ బోర్లు మంజూరయ్యారు. 70 బోర్లు వేశారు. వాటి కోసం రూ. 41,03, 993 ప్రభుత్వం ఖర్చు చేసింది. 70 బోర్లకు గాను ఎనిమిది బోర్లలోనే మోటార్లు బిగించారు. అందుకోసం రూ. 8,98, 162 ఖర్చు చేశారు. త్రిపురాంతకం మండలంలో 2678 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 541 మందికి వ్యవసాయ బోర్లు మంజూరయ్యాయి. 446 మంది రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లు వేశారు. అందుకోసం రూ. 2,41 ,78 , 243 ప్రభుత్వం ఖర్చు చేసింది. కేవలం 22 బోర్లలోనే వ్యవసాయ మోటార్లు బిగించారు. అందుకోసం రూ. 23, 29, 309 ప్రభుత్వం ఖర్చు చేసింది.

రైతు పొలంలో వేసిన బోరు

బకాయిలు చెల్లిస్తేనే..

బోరు వాహనాల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. అప్పులు చేసి వాహనాలు తీసుకొచ్చామని, నిధులు విడుదల చేస్తే తప్ప బోర్లు వేయలేమని వారు అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తమ పొలాల్లో బోర్లు ఎప్పుడు వేస్తారంటూ రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి విసిగి పోయారు.

కొర్రీలతో సతమతం..

బోర్లు తవ్వించుకున్న వారికి మోటార్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ విద్యుత్ సర్వీసు పొందిన వారికి మాత్రమే మోటార్లు ఇస్తామని నిబంధన విధించడంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. తాము భూములను చదును చేసుకుని బోర్లు తవ్వించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నామని వైసిపి ప్రభుత్వం మాట మార్చి తమ నట్టేట ముంచిందని పలువురు రైతులు బహిరంగంగా పెదవి విరుస్తున్నారు.

విద్యుత్తు సర్వీసు ఉన్నా..

జలకళ పథకానికి విద్యుత్ శాఖ వందల సంఖ్యలోనే వ్యవసాయ సర్వీసులను మంజూరు చేసింది. వీటికి సంబంధించి రూ. కోట్ల రూపాయలు విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ద్వామా ఇప్పటి వరకూ కూడా ఇవ్వలేదు. మిగతా రైతులకు విద్యుత్తు సర్వీసులను ప్రభుత్వం ఇవ్వదని, రైతులే డబ్బులు కట్టి సర్వీసులు తీసుకోవాలని ఉత్తర్వులిచ్చింది. దీంతో బోర్లు తవ్వించుకున్న రైతులు సొంత డబ్బు కట్టి సర్వీసు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జలకళ పథకం కేవలం ప్రచారానికే పరిమితమైంది.

దామచర్ల సత్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాస్ డైరెక్టర్లు

సత్యను కలిసిన ఉపాస్ డైరెక్టర్లు

ప్రజాశక్తి-ఒంగోలు

రాష్ట్ర మారిటైమ్ ఛైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్యను ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కాపా అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్‌గా సూరిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డాక్టర్ సూరిబాబు

ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్‌గా డాక్టర్ ఎస్.సూరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరు ఏరియా వైద్యశాల సూప రింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈయన్ని ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్‌గా పనిచేసిన బాపట్ల డిసిహెచ్ఎస్ శేషుకుమార్ సూరిబాబుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సూరిబాబుకు డిసిహెచ్ఎస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నక్కల రాణెమ్మ కాలనీని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం చింతల శివారు ప్రాంతంలోని నక్కల రాణెమ్మ కాలనీని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం పరిశీలించారు. ఇటీవల జిల్లాలో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ పర్యటన సందర్భంగా కాలనీ వాసులు ఆయన్ని కలిసి తమ ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. అందులో భాగంగా కలెక్టర్ కాలనీని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. గతంలో భారీ వర్షాల కారణంగా తమ కాలనీ ప్రక్కనే ఉన్న నల్లవాగు పొంగటంతో ఇళ్లలోకి నీరు చేసినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇళ్లు ఖాళీ చేసి ఒంగోలు కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లపై ఉంటున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. వరద నీరు రాకుండా మెరక తోలించాలని, రిటైనింగ్ వాల్ నిర్మించాలని తెలిపారు. మెరక చేయడానికి సుమారు రూ.40 లక్షల రూపాయలు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 14 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అంత ఖర్చు చేసే బదులు ప్రత్యామ్నాయ అవుట్లలో ఇళ్ల స్థలాలు కేటాయించి కేటాయించే విషయాన్ని కూడా పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ సమీక్షించి నిర్ణయం తీసుకుందామని అధికారులకు తెలిపారు. కలెక్టర్ వెంట వెంట ఆర్‌డిఒ సుబ్బారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రశేఖర్, ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ,ఒంగోలు తహశీల్దారు వాసు ,కొత్తపట్నం తహశీల్దారు మధుసూదన్, డిటీ అర్జున్ రెడ్డి, మండల సర్వేయర్ సుధీర్ బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

పిసిసి ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర బాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న పిసిసి ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర బాబు

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి రాకతో కాంగ్రెస్ పార్టీ ఊపందుకుందని, గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేస్తున్నారని, పిసిసి ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి గౌతు సత్యేంద్ర బాబు తెలిపారు. స్థానిక డిసిసి కార్యాలయంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో త్వరలోనే రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. దేశాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిలు అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. దేశానికి స్వాతంత్రం తీసుకురావడం కోసం పుట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షమైన వైసిపి పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రజల సమస్యలను వైసిపి పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ ఉద్యోగులను విధులలో నుంచి తొలగించిన అంశంలో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసిపి స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ముందడుగు వేసి అల్టిమేటం జారీ చేసి 48 గంటల గడువు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. 24 గంటల సమయం కూడా అవ్వకముందే ప్రభుత్వం దిగివచ్చి స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి విధులలోకి తీసుకోవటం కాంగ్రెస్ పార్టీ విజయమన్నారు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పోరాటం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్ష పార్టీగా ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, జిల్లా అధ్యక్షులు, నగర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులను నియమించిందని, త్వరలోనే నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, డిసిసి ఆధ్వర్యంలో జిల్లా, మండల కమిటీలు నియమించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలపర్తి విజేష్ రాజ్ మాట్లాడుతూ షర్మిలా రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా ప్రకాశం జిల్లా అని, జిల్లాలో ఎన్నో ప్రధాన సమస్యలు ఉన్నాయని, వెలిగొండ ప్రాజెక్టు, దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్, ఒంగోలు డెయిరీ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్మాణం తదితర సమస్యలు ఉన్నాయన్నారు. గతంలో టిడిపి, వైసిపి సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ చేపట్ట లేదన్నారు.ఈ సమస్యలను పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి జిల్లా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉద్దండి మల్లికార్జునరావు, ఉంగరాల శ్రీను, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రిహానా బాను, యూత్ కాంగ్రెస్ నాయకులు దాసరి రవి, కైపు వెంకట కష్ణారెడ్డి, గిద్యోను, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొడ్డు సతీష్, చిరంజీవి, గుత్తి రాజు పాల్గొన్నారు.

వెలుగు ఎపిఎంగా మోహనరావు

ప్రజాశక్తి - కారంచేడు

ఎపిఎం మోహనరావు

వెలుగు నూతన ఎపిఎంగా టి మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎపిఎంగా పనిచేసిన మధుసూదనరావు చీరాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు వివరిస్తానని తెలిపారు. సంఘాల్లో నగదు రికవరీపై దృష్టి సారిస్తానని చెప్పారు. వెలుగు సిసిగా పనిచేస్తున్న వేణు చీరాలకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సుబ్బారావు బాధ్యతలు చేపట్టారు.

సిలబస్ తగ్గించాలని వినతిపత్రం ఇస్తున్న మురళీమోహన్

సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలని కోరుతూ ఎపి ఎస్ఎస్‌టిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. జనవాణి జనసేన భరోసా సామాన్యులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టిచర్స్ ఫోరం తరపున సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలని వినతి పత్రం జనసేన పి గన్నవరం ఎంఎల్‌ఎ వి సత్యనారాయణకు అందజేసినట్లు అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మారిన 10వ తరగతి సాంఘిక శాస్త్రం సిలబస్లో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. 10వ తరగతిలో ప్రతి సెక్షన్లకు ఒకే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బోధించడం, 117జిఒ వల్ల ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5తరగతులను హైస్కూల్లో కలపడం వల్ల 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బోధించడం పని భారమవుతుందని అన్నారు. మారిన నూతన సిలబస్ ప్రకారం రోల్‌తో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు భారంగా ఉన్న సిలబస్ తగ్గించాలని కోరారు. హిందీలో సిలబస్ తగ్గించిన విధంగా దీనిలో కూడా తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖకు సిఫార్సు చేస్తామని తెలిపారని అన్నారు. కార్యక్రమంలో మోసెస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న లెట్స్ హెల్ప్ ప్రతినిధులు

రూ.లక్ష సాయం

ప్రజాశక్తి - చీరాల

ప్రియదర్శిని విద్యోదయ స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.ఒక లక్ష విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేసేందుకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, తెలుగుదేశం అధికార ప్రతినిధి మహేంద్ర నాద్‌కు పాఠశాల విద్యార్థులు యాజమాన్యం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కొండయ్య మాట్లాడుతూ చిన్నారులు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. విద్యార్థుల్లో ఇలాంటి ఉదాత్తమైన విలువలను పెంపొందించడం పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

మాట్లాడుతున్న అద్దంకి ఎడిఎ కె ధనరాజ్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వేమూరు ఎఒ సునీత

ప్రజాశక్తి - అద్దంకి

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి లాభసాటిగా మార్చుకోవచ్చని ఎడిఎ కె ధనరాజ్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, మైలవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందులు పిచికారీ ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడం వలన సమయం, పురుగు మందు అదా అవుతుందని తెలిపారు. ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎ మహమ్మద్ రఫీ, దివ్యకొలు రాధ కృష్ణ మూర్తి, సర్పంచ్ కె అనిల్, అన్నాబత్తిన సుబ్బయ్య, భైరపునేని సత్యనారాయణ పాల్గొన్నారు.

నగరం : మండలంలోని పెద్దవరం, తోటపల్లి పంచాయతీలో వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిపి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ వి రమేష్ బాబు మాట్లాడుతు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి పొలాన్ని సందర్శించి పంటల సాగుపై చర్చించి రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కె నాగ శ్రీనివాసరావు, ఎంపిఈఓలు ఈ ధన్యత, సర్పంచ్ కొనకాల వెంకటేశ్వరరావు, కోటా హరేరామ్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : రబీ పంట సాగుకు రైతులకు రాయితీపై సెనగ విత్తనాలు ఇస్తున్నట్లు ఎఒ పి వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. గోరంట్ల రామస్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెనగ విత్తనాల 33శాతం రాయతీపై అందిస్తున్నట్లు తెలిపారు. జేజే లెవెన్ ఎర్ర శనగలు కేజీ రూ.70.50, హైబ్రిడ్జ్ రకాలైన కాక్ 2, బోల్ట్ శనగలు కేజీ రూ.90.70లకు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య ఉపసంచాలకులు ఎం భార్గవ్ కుమార్, మార్కెటింగ్ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

కారంచేడు : రైతులను ఆధునికంగా అభివృద్ధి చేయడమే పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉద్దేశమని ఎడిఎ కె సుధీర్ బాబు అన్నారు. మండలంలోని కేశవరప్పాడు, రంగప్పనాయుడు వారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. రైతులు ప్రస్తుతం పొగాకు, మిరప మొక్కలు వేసేముందు దుక్కిలో ట్రైకోడెర్మ విరిడి 4కిలోలు చొప్పున పశువుల ఎరువుతో కలపి పిచికారి చేసినట్లయితే వైరస్ మొక్కల వ్యాధికారక శిలీంధ్రాలకు వ్యతిరేకంగా జీవ నియంత్రణగా ఉపయోగపడేలా చేస్తుందన్నారు. వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించేట్టయితే ప్రతి రబీ సీజన్‌లో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలని అన్నారు. పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ చొప్పున 5రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారి చేయాలని తెలిపారు. జింక్ సల్ఫేట్ ద్రావణంలో తెగుళ్ళ మందులను కలపకూడదని అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డ్ నందు అగ్రికల్చర్ లాబ్ ఉంది కనుక రైతులు మట్టి పరీక్షలు, విత్తనాల మొలక శాతం వంటివి పరీక్షలు ఏ రుసుము లేకుండా పరీక్షలు నిర్వహించు కోవచ్చని టెక్నికల్ వ్యవసాయ అధికారి సరిత అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు బిందు మాధురి పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ ఆదినారాయణ బాబు మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. రైతులు తమ పొలాలో ప్రత్యక్షంగా సాంకేతిక మార్పులు చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శారదా పద్మావతి, వ్యవసాయ సహాకులు, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారుల సేవలను రైతులు వినియోగించుకొని అదిక దిగుబడును పొందాలని ఇన్‌చార్జి ఎఒ బి అంజిరెడ్డి కోరారు. మండలంలోని కుందుర్రు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువలను వివరించారు. అనంతరం వరి పంట సాగు క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో ఎఈఓ మాధురి, విఎఎ శివాజీ, పశు వైద్యాధికారి నాగరాజు, రైతులు కొప్పోక కొండలు, ఎడ్లపల్లి మురళి, గుట్ల శ్రీను పాల్గొన్నారు.

వేమూరు : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కావలి, బలిజేపల్లి గ్రామాల్లో ఎఒ సిహెచ్ సునీత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పొలం పిలుస్తుంది పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి పైరుకు మోతాదుకు మించి పురుగు మందులు, ఎరువులు వినియోగించరాదని అన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, ప్రకృతిలో లభించే ఆకులు అలములతో తయారు చేసుకునే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారి చేసి తెగుళ్ళ, పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : అన్నదాతలు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంభించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక ఫల సాయం సాధించి ఆర్థిక అభివృద్ధి సాధించగలరని ఎఒ సుబ్బారెడ్డి అన్నారు. అలవలపాడు, జాగర్లమూడి వారి పాలెం గ్రామాల్లో రైతులు సాగుచేసిన మినుము, మొక్కజొన్న, పొగాకు పంటలను గురువారం పరిశీలించారు. తెగుళ్ల, వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు, పొలం పిలుస్తోంది ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియజేసి, ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అలవలపాడు సర్పంచ్ జకరయ్య, జాగర్లమూడివారిపాలెం ఉపసర్పంచి, నాయకులు జాగర్లమూడి శ్రీను, విఎఎ ఫిలిప్, దిల్జా పాల్గొన్నారు.

పర్చూరు : తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధించడమే పొలం పిలుస్తుంది లక్ష్యమని డాట్ సైంటిస్ట్ మురళీధర్ అన్నారు. వీరన్నపాలెం, కోమర్నేనివారిపలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు సాగు విధానంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. భాస్వరం ఎరువులు ఆఖరి దుక్కిలోనే వేయాలని తెలిపారు. రబి సీజన్లో సాగు చేయబోయే పంటలు గురించి వివరించారు. ఎడిఎ మోహనరావు మాట్లాడుతూ శనగ పంటలో ఎండు తెగులు నివారణకు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారి రమాదేవి, ఎంపీటీసీ పద్మ, విఎఎ మురళి పాల్గొన్నారు.

నగరం పొలంలో మాట్లాడుతున్న ఎడిఎ వి రమేష్‌బాబు

కార్యక్రమంలో సంతమాగులూరు ఎఒ అంజిరెడ్డి

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ముంపు ప్రాంతాల్లో డ్రైన్లు నిర్మించండి
- హైవే అధికారులను ఆదేశించిన జేసీ జైన్

ప్రజాశక్తి - పర్చూరు

రైతులతో మాట్లాడుతున్న బాపట్ల ఆర్‌డిఒ పి గ్లోరియ

రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ ప్రఖైన్ జైన్ జాతీయ రహదారి నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న పర్చూరు, అన్నంబొట్ల వారిపాలెం, తిమ్మరాజుపాలెం, ఉప్పుటూరు, నాగులపాలెం, బోడవాడ గ్రామాలకు చెందిన రైతులు జేసీని కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. అవసరమైన చోట డ్రైన్లను నిర్మించకుండ రహదారి నిర్మాణం చేపడుతున్నారని, దానివల్ల తమ పొలాలు ముంపుకు గురై పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు వివరించారు. ఇంతవరకు తమకు నష్టపరిహారం ఇవ్వలేదని కొందరు రైతులు వాపోయారు. స్పందించిన జెసి జైన్ ఇప్పటివరకు జాతీయ రహదారిపై ఎన్ని డ్రైన్లు నిర్మించారో తెలియజేయాలని హైవే అధికారులను ఆదేశించారు. ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో తప్పనిసరిగా డ్రైన్లు నిర్మించాలని ఆదేశించారు. రైతులకు వెంటనే నష్టపరిహారం అందేటట్లు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఒ గ్లోరియా, తహశీల్దారు బ్రహ్మయ్య, డ్రైనేజ్ డిఈ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వాడితే అనారోగ్యం

ప్రజాశక్తి - నగరం

స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల విద్యార్థుల హాస్టల్లో సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరి కృష్ణ, ఎస్ఐడి భార్గవ్, రేపల్లె సిఐ ఆర్ సురేష్ బాబు, డిప్యూటీ వార్డెన్ పులి నాగరాజు, వి సాంబమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తోటి విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి - చీరాల

సహాయం అందజేస్తున్న తోటి విద్యార్థులు

లెట్స్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో సెయింట్ ఆన్స్ కళాశాల్లో ఇంజనీరింగ్ చదువు తున్న విద్యార్థి పోతురాజుకు రూ.30 వేలు ఆర్థిక సహాయం గురువారం సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ చేతుల మీదగా అందజేశారు. ఎస్‌బిఐ మేనేజర్ చింతలపూడి కరుణాకర్ స్పందించి రూ.10వేలు, సెయింట్ ఆన్స్ కళాశాల సిఎస్ఈ విద్యార్థులు రూ.20వేలు కలిపి మొత్తం రూ.30వేలు అందజేశారు.

భట్టిప్రోలు గ్రామసభలో సర్పంచ్ రవి కిరణ్ మయి

ఉపాధి హామీ పనులు గుర్తించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని భట్టిప్రోలు, వెల్లటూరు, పెదపూలి వర్రు, గొరిగపూడి ,పెదలంక, పెసర్లంక, చింతమోటు, కోనేటిపురం, ఐలవరం, ఆలమూడి, రాచూరు గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పథకం పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు గ్రామసభలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించేందుకు సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుర్తించిన పనులను మరోసారి నవంబర్లో జరిగే గ్రామసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ సుదీర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంట కాలువలను గ్రామసభల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక నేతాజీ వృద్ధుల ఆశ్రమంలో కోటా శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి కోటా ప్రసన్న దంపతులు 25మంది వృద్ధులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను గురువారం పంపిణీ చేశారు. వృద్ధులను ఆదుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం దాతలకు ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కఠారి సత్యనారాయణ, కొసనా వెంకటేశ్వర్లు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇల్లు, ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఇంట్లో దీపారాధన వెలిగించి బయటికి వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రేకుల షెడ్డు, ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని ఆరుంబాక గ్రామ శివారులో గురువారం జరిగింది. గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న వారే ఈరమ్మ ఇంట్లో పూజ చేసి బయటకు వచ్చిన సమయంలో దీపారాధన మంట అంటుకుని ఇల్లు దగ్ధమైంది. పక్కనే ఉన్న ద్విచక్ర వాహనం కూడా కాలిపోవడంతో రూ.1.50 లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఇంకొల్లులో గురువారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎడిఇ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బృందం తనికీలు చేశారు. అక్రమ విద్యుత్ ఏమైనా వినియోగదారులు వాడుతున్నారాని మీటర్లు పరిశీలించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎఈలు కోటేశ్వరరావు, పద్మావతి, ఎఇ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక గ్రంధాలయం ఆధ్వర్యంలో దసరా సెలవుల సందర్భంగా పట్టణంలో విద్యార్థులకు చేతి వ్రాత పోటీ నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకుడు సుగుణరావు తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా పాల్గొనవచ్చని తెలిపారు. అక్కడికక్కడే ఆరుగురు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందచేస్తామని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

◆ చివరి భూములకు సైతం సాగునీరు అందిస్తా ◆ ఎంఎల్‌ఎ ఏలూరి విస్తృత పర్యటన

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం, ఇంకొల్లు

అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు కోరారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. మండలంలో ఆయన గురువారం విస్తృతంగా పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పి ఓదార్చరు. నిరుద్యోగ సమస్య అధిగమించేందుకు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపి, పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు కాలువల ఆధునికరణ, డ్రైనేజీ మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రూ.కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. కొమ్మమూరు కాలువలోని గుర్రపు డెక్క, తూటి కాడ తొలగించామని

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు

అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాలువ గట్లకు సైతం మరమత్తులు చేశామని పేర్కొన్నారు. రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చివరి ఆయకట్టు భూములకు సైతం నీరు అందిస్తామన్నారు. అన్నదాతలకు ఎరువులు కొరత లేకుండా అందజేశామని అన్నారు. ఆవులదొడ్డిగొల్లపాలెంకు చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు వడ్లమూడి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోడూరివారి పాలెం, కాటంవారిపాలెంకు చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు.

పిడుగుపాటుకు బిటెక్ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - చీరాల

దసరా పండగ సందర్భంగా కళాశాలకు సెలవు దినాలు ప్రకటించడంతో సరదాగా అమ్మమ్మ ఇంటిలో గడిపేందుకు వచ్చిన బీటెక్ విద్యార్థిని పిడుగుపాటుకు మృతి చెందిన సంఘటన మండలంలోని పాత చీరాలలో గురువారం చోటు చేసుకుంది. ఉదయం కురిసిన భారీ వర్షంలో మబ్బులు పట్టి ఉరమటంతో సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. బాపట్లలోని నరాలశెట్టి వారిపాలెంకు చెందిన నూతక్కి వెంకటేశ్వర్లు, పార్వతీ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె నూతక్కి తులసి (20) బాపట్ల ఎన్టీఆర్ ఫుడ్ టెక్నాలజీ కళాశాల్లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. దసరా సెలవులు కావడంతో చీరాల్లోని అమ్మమ్మ ఇంటి వచ్చింది. వర్షం కురిసే సమయంలో ఆమె

మృతి చెందిన విద్యార్థిని తులసి

ఇంటిపై ఉండడంతో వర్షం కురుస్తూ మెరుపులు ఒక్కసారిగా రావడంతో పిడుగు పాటుకు గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రథమ చికిత్స చేయించి హాస్పటల్‌కు తరలిద్దాం అనుకునే లోపే ఆమె మృతి చెందింది. సెలవుకు వచ్చిన తన మనవరాలు కళ్ళముందే పిడుగుపాటుకు మృతి చెందటంతో అమ్మమ్మ రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న తులసి తల్లి, దండ్రులు బాపట్ల నుంచి చీరాలకు చేరుకున్నారు. బీటెక్ పూర్తిచేసుకుని మంచి ఉద్యోగం చేస్తోందని ఎంతో ఆశపడితే ప్రకృతి వైపరీత్యానికి తమ బిడ్డ మృత్యు ఒడికి చేరుకొందని తల్లి, దండ్రుల రోధిస్తున్న తీరు చూపరులను సైతం కండతడి పెట్టించింది.

బాధ్యతలు స్వీకరించిన మండల అధికారులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో ప్రధానమైన మూడు శాఖల అధికారులు గురువారం బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా పనిచేసిన బి రామాంజనేయులు బదిలీపై ప్రకాశం జిల్లా కొండేపి వెళ్లారు. ఆయన స్థానంలో చిన్నగంజాం ఎంపిడిఒగా పనిచేస్తున్న కె స్వరూపరాణి బాధ్యతలు స్వీకరించారు. తహాశీల్దారుగా పనిచేస్తున్న డి నాగరాజారావు బదిలీపై బాపట్ల డిఒగా వెళ్లారు. ఆయన స్థానంలో తాళ్లూరు తహాశీల్దారుగా పనిచేస్తున్న పి సింగారావు బాధ్యతలు స్వీకరించారు. సుదీర్ఘకాలంగా పిఆర్ ఎఈగా పనిచేస్తున్న ఎన్‌విఎస్ రామ్ కుమార్ బదిలీపై ఒంగోలు వెళ్లారు. ఆయన స్థానంలో బల్లికురవ పంచాయతీరాజ్ ఎఈగా పనిచేస్తున్న హనుమంతరావును

ఎంపిడిఒ స్వరూపరాణి

తాసిల్దారు పి సింగారావు

ఇక్కడికి బదిలి చేశారు. ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దారు సింగారావు, ఎంపిడిఒ స్వరూపరాణిని తెలుగుదేశం నాయకులు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఎనికపాటి శ్రీనివాసరావు, పూనాటి రామాంజనేయులు, మురుకొండ సుబ్బారావు, కె శ్రీనివాసరెడ్డి కలిసి అభినందించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దని నిరసన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని, ఇతర ఉక్కు కర్మాగారాలను బడా పెట్టుబడిదారులకు కేటాయించేందుకు మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లిముంత సాంబశివరావు కోరారు. మోడీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాల ప్రైవేటీకరణ చర్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టినట్లు తెలిపారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయం ఎదుట ఏఐఎఫ్‌టియు న్యూ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన లాభాల్లో ఉన్న పరిశ్రమ నష్టాలలోకి వెళ్లిందని అన్నారు. అంత పెద్ద ఫ్యాక్టరీకి సొంత గనులను కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మర్రివాడ వెంకటరావు అన్నారు. ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక నాయకుడు కౌతరపు సీతారామయ్య, దొంతు శ్రీనివాసరావు, ప్రజా తంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ, కౌతరపు రామకృష్ణ పాల్గొన్నారు.

పూజితను సన్మానిస్తున్న నిర్వాహకులు

విట్ టాపర్ పూజితకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - బాపట్ల

అమరావతి విట్ విశ్వ విద్యాలయంలో క్యాంపస్ టాపర్‌గా నిలిచిన కర్లపాలెం మండలం గణపవరం విద్యార్థి గొట్టిముక్కల పూజిత బంగారు పతకం సాధించారు. విశ్వవిద్యాలయంలో నాలుగో ఏడాది విద్య నభ్యసిస్తున్న పూజిత అత్యధిక మార్కులు సాధించి క్యాంపస్ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఆమె అమెరికాలో వెల్స్ ఫోర్గో లో ప్లేస్మెంట్ సాధించి నట్లు కాకతీయ సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షులు మానం విజేత తెలిపారు. బంగారు పతకం సాధించిన పూజితను సమాఖ్య ఆధ్వర్యంలో కమ్మ జన సమితి కళ్యాణ మండపంలో సన్మానించారు. పూజిత మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షులు ఆచంట రమేష్ బాబు, ఉపాధ్యక్షులు జి యజ్ఞ నారాయణ, ప్రధాన కార్యదర్శి పువ్వాడ దుర్గాప్రసాద్, కార్యదర్శి మద్దిన ప్రసన్నాంజనేయులు, కోశాధికారి ఎన్ గణేష్, కె శ్రీకాంత్, ఇనగంటి శ్రీనివాసరావు, కూచిపూడి శ్రీరాములు, మానం రామ్మోహనరావు, కారుమంచి వెంకట నాగార్జున, అప్పస్వామి మహేంద్ర, ఏలూరి హరిబాబు, నల్లమోతు సుబ్బారావు, ఎన్ వాసుదేవరావు పాల్గొన్నారు.

కళశాలతో మహిళల ఊరేగింపు

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పంగులూరు

రేణింగవరంలో దసరా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. గ్రామంలోని పోలేరమ్మ, గంగమ్మ, నాంచారమ్మ, పోతురాజు త్రిశక్తి పీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. 3నుండి 12 వరకు శతాధిక ప్రతిష్టాపనాచార్యులు బొర్రా వెంకట అనంతాచార్యులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 12న మహిళలచే కోలాట ప్రదర్శన, అమ్మవారి తిరునాళ్ల జరుగుతాయని త్రిశక్తి పీఠం ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

పర్చూరు : మండలంలోని నూతలపాడు మల్లికార్జున స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వణుకూరి ప్రభాకరరెడ్డి, శ్రీలక్ష్మి, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, పద్మావతి, పోలూరి అంజిరెడ్డి, పోలమ్మ పాల్గొన్నారు. స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ కోటిరెడ్డి, దేవస్థానం చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ వెబ్‌సైట్‌కు అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) విద్యార్థులు, ప్రయాణికులకు అందించే బస్ పాస్ వెబ్సైట్ ఈనెల 5, 6 తేదిల్లో సాఫ్ట్వేర్ ఆధునీకరణ చేస్తున్న కారణంగా నిలిపివేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహనరావు తెలిపారు. 7వ తేదీ నుండి యధావిధిగా బస్సు పాసుల కౌంటర్ నందు ఇవ్వబడతాయని తెలిపారు.

కారుణ్య నియామకంలో ఉద్యోగం

నియామక పత్రం అందజేసిన ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అనారోగ్యమంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి కారుణ్య నియామకంలో ఉద్యోగ నియామక పత్రాన్ని ఎస్‌పి ఎఆర్. దామోదర్ అందజేశారు. గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 2023 జూన్ 8న అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ నారాయణరావు మరణించారు. ఆయన కుమారుడు అనీల్ కుమార్‌కు కారుణ్య నియామకంలో జిల్లా పోలీసు ట్రైనింగ్ కాలేజీ లో టైపిస్ట్ గా ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఎస్‌పి మాట్లాడుతూ నారాయణరావు హెడ్ కానిస్టేబుల్ గా సుదీర్ఘ కాలంగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకిత భావంతో బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని, వత్తి నైపుణ్యం పెంచుకొని అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని అనీల్ కుమార్‌కు ఎస్‌పి సూచించారు. ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ ఎఒ సులోచన, డిపిఒ సూపరింటెండెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అనీల్ కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎస్‌పి

ఆపరేషన్ లేకుండానే కవాటాల మార్పిడి

కిమ్స్ హాస్పిటల్ వైద్యుడి అరుదైన ఘనత

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు కిమ్స్ హాసిటల్‌లో కార్డియాలజీ విభాగంలో టిఎవిఐ (ట్రాన్స్కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేసెంట్) అను అత్యాధునికమైన చికిత్సను గురువారం నిర్వహించారు. ఆపరేషన్ లేకుండానే మూసుకు పోయిన గుండెలోని కవాటాలను ఈ చికిత్స ద్వారా మార్పిడి చేసి అరుదైన ఘనతను సాధించారు. మనదేశంలో ఈ చికిత్స చేసే అతి తక్కువ ఆసుపత్రుల జాబితాలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ చేరింది. 76 ఏళ్ల వృద్ధుడికి పరీక్షలు చేసి అతనికి గుండెలో అయోర్టిక్ వాల్ అనే కవాటం పూర్తిగా దెబ్బతిందని వైద్యులు గుర్తించారు. ఇతనికి ఇంతకు ముందే బైపాస్ ఆపరేషన్ జరిగి.. ఊపిరితిత్తుల సమస్య కూడా ఉండటం వలన ఓపెన్ హార్ట్‌సర్జరీ ద్వారా కవాటాన్ని మార్చటం పేషెంట్ ప్రాణానికి చాలా ప్రమాదం అని గుర్తించిన డాక్టర్ కపిల్ కార్తికేయరెడ్డి టిఎవిఐ అనే చికిత్స చేశారు. పేషెంట్‌కి చిన్న సమస్య కూడా రాకుండా అత్యంత జాగ్రత్తతో ఈ చికిత్స చేయడం వల్ల, చేసిన రెండో రోజే పేషెంట్ పుర్తిగా కోలుకున్నారు. దేశంలోని మెట్రో నగరాలతో పోలిస్తే మూడోవంతు ఖర్చుతోనే ఈ ప్రక్రియను కిమ్స్ హాస్పిటల్‌లో పూర్తి చేశారు. ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినందుకు డాక్టర్ కపిల్ కార్తికేయరెడ్డిని హాస్పిటల్ యాజమాన్యం మరియు ఇతర వైద్యసిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కపిల్ కార్తికేయరెడ్డి మాట్లాడుతూ దేశంలో టిఎవిఐ చికిత్స చేయగల అతి తక్కువ ఆసుపత్రుల జాబితాలో కిమ్స్ హాస్పిటల్ చేరడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పేషెంట్ అతి తక్కువ సమయంలోనే పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కిమ్స్ హాస్పిటల్ ఎగ్జికూటివ్ డైరెక్టర్ టి. గిరి నాయుడు మాట్లాడుతూ మెట్రో నగరాలతో పోటీ పడుతూ వైద్యసేవలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ముందడుగు వేసిందని తెలిపారు. ఈసమావేశంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ వివరాలను వెల్లడిస్తున్న కిమ్స్ వైద్యులు

విద్యుత్ మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామంలో గతనెల 20న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దిరాలపాడు గ్రామాభివృద్ధికి హామీలు ఇచ్చారు. అందులో భాగంగా విద్యుత్ మరమ్మతు పనులను ఎమ్మెల్యే విజయకుమార్ గురువారం ప్రారంభించారు. అంబేద్కర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు డిఇ మాకినేని హరిబాబు, ఎంపిడిఒ వై.మహలక్ష్మి, తహశీల్దారు కె.ప్రవీణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ కుమార్ , క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మడి సాయి బాబా. టిడిపి మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మి వరప్రసాద్ , సర్పంచి స్వర్ణ అనురాధ ,షేక్ ఖజావలి , టిడిపి గ్రామ అధ్యక్షుడు పెనుబోతు సునీల్ , దివి పున్నారావు, స్వర్ణ కిషోర్ పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల

యజమానులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘాల సంయుక్త సమావేశంలో కోరారు. రామతీర్థంలోని విటిసి కేంద్రంలో చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం, బూదవాడ, ఏలూరురోడ్డు ఏరియాల్లోని పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘాల సంయుక్త సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి యర్రగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాలిషింగ్ యూనిట్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడడానికి ప్రతి ఆదివారం సెలవు దినం పాటించాలని, వేస్టు మెటీరియల్‌ను ఎడ్జ్‌కటింగ్ యూనిట్లకు ఇవ్వకుండా పాలిషింగ్ యూనిట్ల వారే ఎవరికి వారే కటింగ్ చేసుకోవాలని తీర్మానించారు. మెటీరియల్ రేటు పెంచుకునే విధంగా ఈనెల 10,12 తేదీల్లో గ్రానైట్ బయ్యర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి:కాట్రగడ్డ

సంక్షోభం ఎదుర్కొంటున్న పాలిషింగ్ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని చీమకుర్తి ఏరియా పాలిషింగ్ యూనిట్ల యజమానుల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ రమణయ్య కోరారు. గత ప్రభుత్వం పరిశ్రమను పట్టించుకోలేదన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు ,మైనింగ్ బిల్లులు తగ్గించాలని, విద్యుత్ సబ్సిడీలు విడుదల చేయాలని కోరారు. వేలాదిమంది యజమానులు, కార్మికులు, ఉద్యోగులు ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఏరియా యూనిట్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, గౌరవాధ్యక్షుడు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, జి.నాగయ్య, జిల్లా ప్రతినిధి కందిమళ్ళ గంగాధరరావు, ఎస్‌కె. అహమ్మద్‌బాషా, ఎస్‌కె. రఫీ,ఎస్‌కె. షరీఫ్, ఆర్‌ఎల్‌పురం అసోసియేషన్ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు బూదవాడ ఏరియా అసోసియేషన్ అధ్యక్షుడు లగడపాటి శ్రీనివాసరావు, ఏలూరు ఏరియా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, యూని యన్ నాయకులు రావిపాటి రాంబాబు, రాధాకృష్ణ, చలపతిరావు, రాజశేఖర్, ఎస్‌కె.అప్‌సాలేహా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-కొత్తపట్నం

రసాయనాలు వినియోగాన్ని తగ్గించి పంట దిగుబడులు పెరిగేలా రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వటమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మండల పరిధిలోని మోటుమాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించేలా అధికార యంత్రాంగం రైతులు వద్దకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయంలో సుస్థిరాభివద్ధిపై ప్రభుత్వం దష్టి సారించినట్లు తెలిపారు. ఆ దిశగా రైతులకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందుబాటులోకి తెచ్చి వినూత్న సాగు విధానాలను చేరువ చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలియజేశారు. రైతులు కేవలం వ్యవసాయంపైనే కాకుండా దాని అనుబంధ రంగాలపైనా అభివద్ధి సాధించేలా ప్రభుత్వం సహకరిస్తున్నట్లు తెలిపారు. సేంద్రీయ వ్యవసాయానికి కొత్త పట్నను మోడల్ మండలంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు సత్వరమే మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం సేంద్రీయ వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను కలెక్టర్, ఇతర శాఖల అధికారులు పరిశీలించారు. సేంద్రీయ కూరగాయల వినియోగం పెరిగేలా ప్రత్యేక దష్టి సారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎం ఐపి డిపి పివి.రమణ , ఎల్‌డిఎం. సురేష్, ఎపిసి ఎన్‌ఎఫ్ డిపిఎం సుభాషిణి, ఆత్మ, పశు వర్ధక శాఖ అధికారులు, ఆర్‌డిఒ సుబ్బారెడ్డి, తహశీల్దారు మధుసూదన్, ఎఒ మోహన్‌రెడ్డి, మోటుమాల పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : మండల పరిధిలోని పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వి. సుధాకర్ మాట్లాడుతూ వరి విత్తనాలను సూడోమోనస్‌తో విత్తన శుద్ధి చేయాలని రైతులకు సూచించారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కె.మధుసూదనరావు, విఎఎలు పి.సురేష్, ఎం.కిషోర్, మత్స్యశాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం అధికారి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.